నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 18 ఏప్రిల్ 2024 | KAMAREDDY

వడ్డీ వ్యాపారులు, జీరో ఫైనాన్స్‌లపై ఆరా

శక్కర్‌నగర్, ఏప్రిల్ 17: బోధన్ పట్టణంలోని వడ్డీ వ్యాపారస్తులు, జీరో ఫైనాన్స్‌లపై సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాల మేరకు పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటి వరకు కొంతమంది వడ్డీ వ్యాపారులను గుర్తించామని పట్టణ సీఐ ఎస్.వీరయ్య తెలిపారు. వడ్డీ వ్యాపారంతో ప్రజలను ఇబ్బంది పెట్టేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. అవసరమైతే త్వరలో కౌన్సెలింగ్ కూడా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వడ్డీ వ్యాపారస్తులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నామినేషన్లకు వేళాయె..

- నేటి నుంచి స్వీకరణ..
- 25 వరకు అవకాశం
- నిజామాబాద్ లోక్‌సభకు ఎన్నికల అధికారిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- జహీరాబాద్ స్థానానికి సంగారెడ్డిలో రిటర్నింగ్ కార్యాలయం
- పకడ్బందీగా కోడ్ అమలుపై అధికార యంత్రాంగం దృష్టి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్

నేడే ఎన్నికల నోటిఫికేషన్

కలెక్టరేట్‌లో సిద్ధం చేసిన రిటర్నింగ్ అధికారి గది

నిజామాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక సమరంలో భాగంగా రాష్ట్రంలోని పార్లమెంటరీ నియోజకవర్గాలకు నాలుగో విడుతగా పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నేడు నోటిఫికేషన్ విడుదల కానుంది. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను అనుసరించి నిజామాబాద్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. నేటి (గురువారం) నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఆదివారం మినహాయిస్తే నామినేషన్ల దాఖలకు 7 రోజులపాటు అవకాశం ఉన్నది. ఎన్నికల్లో పోటీచేసేందుకు ఉత్సాహం చూపుతున్న వారంతా ఈసీ నిబంధనలకు మేరకు ఇప్పటికే తమ నామినేషన్ల ఏర్పాట్లు చేసుకున్నారు. న్యాయ నిపుణుల సహాయ, సహకారాలతో తప్పులు దొర్లకుండా కసరత్తు పూర్తి చేయగా, మంచి ముహూర్తం చూసుకొని దాఖలు చేయనున్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు.

29వరకు ఉప సంహరణకు గడువు...

నేటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వాటిని 26న పరిశీలించి తప్పులుంటే తిరస్కరిస్తారు. అభ్యర్థులు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకునేందుకు ఏప్రిల్ 29 వరకు ఈసీ అవకాశం ఇచ్చింది. ఈ గడువు ముగిసిన వెంటనే బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించి ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తారు. మే 13న పోలింగ్ నిర్వహించనుండగా, నామినేషన్ల ఘట్టం అనంతరం మే 11న సాయంత్రం 5గంటల వరకు.. అభ్యర్థులకు సరిగ్గా రెండు వారాలపాటు ప్రచారానికి అవకాశం ఉంటుంది. జూన్ 4న కౌంటింగ్ అనంతరం ఫలితాలను వెల్లడిస్తారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..

నెలక్రితమే సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదలకాగా, అప్పటినుంచే దేశ వ్యాప్తంగా కోడ్ అమల్లోకి వచ్చింది. సరైన పత్రాలు లేకుండా మద్యం, రూ.50 వేలకు మించి నగదును తరలిస్తే సీజ్ చేస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో అడుగడుగునా తనిఖీలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో అంతగా తనిఖీలు కనిపించడంలేదు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే కొన్నిచోట్ల ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను సైతం ఎత్తేశారు. పోలింగ్‌కు ఎక్కువ రోజుల సమయం ఉండడంతో అధికారులు అంత సీరియస్‌గా తీసుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే నేడు నోటిఫికేషన్ జారీ కానుండడంతో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించడంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులతోపాటు నగదు, మద్యం నిల్వలు, రవాణాపై నిఘా పెట్టనున్నారు.



నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్/వినాయక్‌నగర్, ఏప్రిల్ 17: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానం ఎన్నికలకు సంబంధించి నేడు (గురువారం) నోటిఫికేషన్ విడుదల చేస్తామని, అదే రోజునుంచి నామినేషన్లను స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సీపీ కల్మేశ్వర్‌తో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆదివారం మినహాయించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. సెక్యూరిటీ కింద జనరల్ అభ్యర్థులు రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.12,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ మొత్తాన్ని నగదు లేదా చలానా రూపంలో చెల్లించవచ్చని, చెక్కులు అంగీకరించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంక్ అకౌంట్ తీసుకొని, దీని ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాలన్నారు. గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని తెలిపారు. మొత్తం 22 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని, ఇప్పటివరకు రూ.33లక్షల 4వేల 837 నగదుతోపాటు రూ. 28లక్షల విలువచేసే ఆభరణాలు, ఇతర వస్తువులు సీజ్ చేశామని వివరించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను అనుసరిస్తూ కలెక్టరేట్ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నలుగురికన్నా ఎక్కువ మంది ఒకేచోట ఉండొద్దని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటివరకు 1900 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ పాల్గొన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ ఎప్పుడు?

- ఎన్నికల కోడ్ పేరిట రేవంత్ సర్కారు కాలయాపన
- ఫ్రీ బస్సు తప్ప చేసిందేమీ లేదు
- కాంగ్రెస్, బీజేపీని ప్రజలు నమ్ముతలేరు
- బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 17: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారని, ఎన్నికల కోడ్ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధుకే దిక్కులేదు కానీ రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పడం విడ్డూరమన్నారు. గెలిచిన వెంటనే రుణ మాఫీ చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి నాలుగు నెలలు అయినా ఇప్పటి వరకు చేయకపోగా ఆగస్టులో చేస్తామని, ఎన్నికల కోడ్ అడ్డం ఉన్నదని చెబుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఫ్రీ బస్సు తప్ప వారు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని, కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు వరి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడం లేదు కానీ, రుణ మాఫీ పేరిట మరోసారి మోసం చేసేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి ఎప్పుడైనా వచ్చి నిరుద్యోగ సమస్యలను తెలుసుకున్నారా..? పరిష్కరించారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రైతుల బతుకులను ఆగం చేస్తారన్నారు. బీజేపీ ఎంపీ అర్వింద్ ఐదేండ్లలో చేసిందేమీలేదని అన్నారు. మాటలు తప్ప పనిచేసిన పాపాన పోలేదని విమర్శించారు. అర్వింద్‌ను ప్రజలు నమ్మడం లేదనే మోదీని చూసి ఓటు వేయాలని అడుగుతున్నాడని అన్నారు. మోదీకి ఓటు వేస్తే సమస్య కూడా మోదీ వచ్చి తీరుస్తాడా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు పచ్చగా ఉన్న తెలంగాణ నాలుగు నెలలకే ఆగమవుతున్నదని అన్నారు.

రేపు నామినేషన్..

బీఆర్ఎస్ అభ్యర్థిగా తాను ఈ నెల 19న నామినేషన్ వేయనున్నట్లు బాజిరెడ్డి తెలిపారు. అదేరోజు కలెక్టరేట్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ప్రచార సభకు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రశ్నించే పార్టీ అని, తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ధర్పల్లి జడ్పీటీసీ జగన్ మోహన్, సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు సుజిత్‌సింగ్ ఠాకూర్, నగర అధ్యక్షుడు సిర్పరాజు, కార్యదర్శి ఎనుగందుల మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

- టీయూలో కొంతమంది ఆచార్యుల తీరు
- రిజిస్ట్రార్ తనిఖీల్లోనే బట్టబయలైన వాస్తవాలు
- ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో పైనలిస్తే సక్రమం
- తప్పు చేసిన వారికి నోటీసుల జారీలో తీవ్ర జాప్యం
- మెయిన్, సౌత్ క్యాంపస్‌లో 'బయోమెట్రిక్' అక్రమాలు

జీతాల్లోనూ కక్కుర్తి!

విధులకు హాజరవ్వకుండా వక్రబుద్ధి

నిజామాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) తెలంగాణ యూనివర్సిటీలో పరిపాలన తీరు పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లు అన్న చందంగా మారింది. ఎవరికి వారే యమునా తీరేనన్న వ్యవహారంతో టీయూ మరింత గాడి తప్పుతున్నది. బాధ్యతాయుతమైన హోదాల్లో ఉంటున్న వ్యక్తులే వక్రబుద్ధిని ప్రదర్శిస్తూ విధులకు గైర్హాజరు అవుతూ జీతం బిల్లులను అప్పనంగా మెక్కేస్తున్నారు. విధులకు రాకుండానే, క్లాసులు తీసుకోకుండానే కంచనుగా జీతం మాత్రం తీసుకుంటున్నారు. ఇదేం అంటే... అంతా మా ఇష్టం అన్నట్లుగా కొంతమంది తెగించి చెప్పేస్తున్నారు. సన్మార్గంలో పనిచేసే వారు సైతం కొద్దిమంది తీరుతో తప్పటడుగులు వేయాల్సి వస్తున్నది. డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌తోపాటు జంగంపల్లి సౌత్ క్యాంపస్‌లోనూ ఇదే తంతు వెలుగు చూస్తున్నది. కొద్దిరోజుల క్రితం రిజిస్ట్రార్ యాదగిరి స్వయంగా సౌత్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాంగణాన్ని కలియ తిరగడంతోపాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. ఇందులో ఒకరిద్దరు ప్రొఫెసర్లు హాజరు కాకపోవడంతో రిజిస్ట్రారే స్వయంగా సీఎల్(క్యాజువల్ లీవ్) పేరిట రిజిస్ట్రార్‌లో రిమార్క్స్ రాశారు. సీన్ కట్ చేస్తే సదరు ప్రొఫెసర్ మాత్రం నెల తిరిగే సరికి జీతం కోసం ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు క్లెయిమ్స్ పెట్టుకున్నారు. రిజిస్ట్రార్‌కు ఈ విషయం తెలియడంతో బిల్లును వాపస్ పంపించారు. కానీ సదరు ఆచార్యురాలిపై మాత్రం చర్యలు తీసుకోలేదు. ఏకంగా రిజిస్ట్రార్ రిమార్క్స్‌ను ఉల్లంఘిస్తూ విధులకు హాజరైనట్లుగా బుకాయించినా వారిపై చర్యలు శూన్యమయ్యాయి.

బయోమెట్రిక్‌తో భయాలు...

కొద్దిరోజుల క్రితమే టీయూ పరిపాలన విభాగంలో కీలక వ్యక్తి ఛాంబర్‌లో కొంతమంది ఆచార్యుల వాదోపవాదాలు బయటికి పొక్కాయి. ప్రొఫెసర్లకు బయోమెట్రిక్ పెట్టడం ఏంటంటూ? నిలదీయడం ఇప్పుడు చర్చకు దారితీస్తున్నది. కలెక్టర్ కన్నా ఎక్కువ జీతాలు తీసుకునే తమ లాంటి వారికి బయోమెట్రిక్ పెట్టడం సబబు కాదంటూ వాదించిన తీరు యూనివర్సిటీలో ఆసక్తిని రేపుతున్నది. సమయానికి విధులకు హాజరైతే బయోమెట్రిక్ ఉన్నా లేకున్నా చర్చే ఉండదు. కానీ సమయపాలన లేకపోవడంతోనే చాలా మంది ప్రొఫెసర్లకు ఇప్పుడు మింగుడుపడడం లేదు. హైదరాబాద్ నుంచి వచ్చి పోయే వారంతా బయోమెట్రిక్ మూలంగా నెత్తి పట్టుకోవాల్సి వస్తున్నది. కొంతమంది మాత్రం పైసలిచ్చి సౌత్ క్యాంపస్‌లోని ప్రొఫెసర్‌ను ఆదర్శంగా తీసుకొని కక్కుర్తి గాళ్లతో చేతులు కలుపుతున్నారు. ఇలా ఒకటి కాదు... రెండు కాదు అనేక డిపార్ట్‌మెంట్లలో సమయపాలన గాలికి కొట్టుకుపోతున్నప్పటికీ పట్టించుకోవాల్సిన యూనివర్సిటీ పెద్దలు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. యూనివర్సిటీలో వేలాది మందికి పాఠాలు బోధించి వారి జీవితాల్లో వెలుగు అందించాల్సిన ప్రొఫెసర్లలో కొంతమంది వక్రమార్గాన్ని ఎంచుకోవడంతో నీతి, నిజాయితీగా పనిచేసే వారికి సైతం చెడ్డ పేరు వస్తున్నది. ఎన్నో లక్ష్యాలతో యూనివర్సిటీకి వచ్చే సగటు విద్యార్థికి బాసటగా నిలిచి ఆదర్శంగా నిలవాలని ప్రొఫెసర్లను విద్యార్థులు కోరుతున్నారు. జీతం కోసం కక్కుర్తి పడుతున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి తక్షణం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు టీయూ రిజిస్ట్రార్‌ను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

పైసలిస్తే సర్వం సక్రమమే...

తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు నుంచి నాన్ అకడమిక్ విభాగంలో పాతుకుపోయిన కొంతమంది వ్యక్తులు కూడా యూనివర్సిటీ ఆగమాగం కావడానికి కారణభూతులు అవుతున్నారు. సన్మార్గంలో నడిచి ఆదర్శంగా ఉండడం పక్కన పెట్టి వక్రమార్గంలో డబ్బులు సంపాదించడం, పదోన్నతులు పొందడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇందుకోసం రికార్డులను తారుమారు చేయడం, లేదంటే ఫైళ్లను మాయం చేయడం వీరికి పరిపాటిగా మారింది. యూనివర్సిటీ స్థాపన నుంచి పాతుకుపోయిన నాన్ అకడమిక్ సహాయ రిజిస్ట్రార్ ఒకరి సహాయంతో గైర్హాజరైన వారికి జీతాల చెల్లింపులు చకచకా జరుగుతున్నట్లుగా టీయూలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పైసలిస్తే సర్వం పనులు చేసి పెట్టిస్తారంటూ బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను కబంధ హస్తాల్లో పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సౌత్ క్యాంపస్‌లో ఓ మహిళా ప్రొఫెసర్ నెలలో సగానికి ఎక్కువ రోజులు ఏడాది పొడవునా డుమ్మా కొట్టడం రివాజుగా మారింది. ఏ ఒక్క రోజూ విధులకు సక్రమంగా రాకుండానే జీతం మాత్రం తీసుకుంటుండడం అందరికీ తెలిసిన విషయమే. ఇక డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌లో మొన్నటికి మొన్న గంజాయి సరఫరా కేసులో అరెస్ట్ అయిన కెమిస్ట్రీ విభాగానికి చెందిన వ్యక్తి సైతం ఇదే తీరును నడిపించినట్లుగా వెలుగు చూసింది. నెలల తరబడి యూనివర్సిటీకి రాకున్నా జీతం మాత్రం జమ అవ్వగా గంజాయి కేసు సందర్భంగానే అక్రమం బట్టబయలైంది. ఇలా అక్రమాన్ని సక్రమంగా మలుచుకుంటున్న ఇంటి దొంగలు చాలా మంది ఉన్నారంటూ విద్యార్థులు నిట్టూరుస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలి

బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సారంగాపూర్, ఏప్రిల్ 17: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓట్ల ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని తన నివాస ప్రాంగణంలో బుధవారం నిజామాబాద్ అర్బన్‌లోని ఆలిండియా జై హింద్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఆల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహాచారి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి షేక్ షాబాద్, కోశాధికారి షేక్ ఖాసింతోపాటు 39, 38, 13, 30, 15 డివిజన్లకు చెందిన 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో మట్టి కరిపించాలని సూచించారు. ఝూఠా పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, ఈ రెండు ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించి చైతన్యపర్చాలన్నారు.

గులాబీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

బాలసదనం విద్యార్థుల అదృశ్యం

కామారెడ్డి, ఏప్రిల్ 17: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిజనవాడ జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న ఇద్దరు బాలసదనం విద్యార్థులు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బాలసదన్‌కు చెందిన ఏడేండ్ల గంగోత్రి, నజీయా ఈ నెల 13న ఉదయం 11.30 గంటలకు పాఠశాలకు వెళ్లారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు చెప్పకుండానే గంగోత్రి, నజీయా బయటికి వెళ్లారని, వారి ఆచూకీ కోసం ఎంత వెతికినా దొరకలేదని తెలిపారు. బాలసదనం ఇన్‌చార్జి గంగూబాయి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పిల్లల ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.